



ఐపీఎల్

- బానిసలుగా మారుతున్న కొందరు యువకులు
- పందెం డబ్బు కోసం నేరాలకు పాల్పడుతున్న వైనం
- ఉద్యోగులకూ బెట్టింగ్ ఫీవర్
- అప్పులపాలై ఐపీ పెడుతున్న కొందరు
- బలవన్మరణాలకు పాల్పడుతున్న మరికొందరు
- ఛిద్రమవుతున్న కుటుంబాలు
- బెట్టింగ్ నియంత్రణలో పోలీసులు విఫలం

తాడిపత్రి టౌన్: క్రికెట్‌ను ఓ మతంగా భావించే మన దేశంలో ఈ ఆటకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. వినోదం కోసం చూసే ఈ ఆటలోకి ఐపీఎల్ రాక కొందరు క్రికెట్ ప్రేమికులను బెట్టింగ్‌రాయుళ్లగా మార్చేసింది. ముఖ్యంగా యువత ఈ బెట్టింగ్ ఉచ్చులో చిక్కి విలవిలలాడుతున్నారు. కొందరు ఉద్యోగులు కూడా ఐపీఎల్ బెట్టింగ్ మహమ్మారి వలలో పడి సర్వస్వం పోగొట్టుకుని ఐపీ పెట్టి ఊరు విడిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరికొందరు ఉన్న డబ్బు పోగొట్టుకుని, అప్పుల భారంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తక్కువ సమయంలో ఎటువంటి కష్టం లేకుండానే ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశే ఈ అనర్థాలకు కారణమవుతోంది. ఐపీఎల్ మొదట్లో బెట్టింగ్‌లకు పాల్పడేవారు పక్కపక్కనే ఉండి డబ్బులు పంచుకొనేవారు. కానీ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మొబైల్ ఫోన్లలో పలు యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో కూడా బెట్టింగ్ సులువుగా ఉండటంతో పలువురు విద్యార్థులు సైతం దీనిబారిన పడి తల్లిదండ్రులు ఇంటి నుంచి చదువుల కోసం, హాస్టల్ ఫీజులు ఇతర ఖర్చులకు పంపే డబ్బును తగలేస్తున్నారు. నేరాలకు పాల్పడేందుకు సైతం వెనుకాడటం లేదు.



ట్రెండ్ సెట్ చేస్తున్న యువత

బెట్టింగ్ ఆడే విధానం కూడా మారుతోంది. మొదట్లో ఓవర్ల ప్రకారం బెట్టింగ్‌లు జరుగుతుండేవి. కానీ ఈ ఐపీఎల్ మ్యాచ్‌ల్లో మాత్రం టాస్ నుంచి మ్యాచ్ ముగిసే వరకు బాల్ టూ బాల్ బెట్టింగ్ జరుగుతోంది. ఈవిషయంలో పలువురు యువకులు నూతన ఒరవడికి తెరతీస్తున్నా రనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన జట్ల మధ్య మ్యాచ్ ఉంటే యువతకు అన్నం, ఇళ్లు అసలే గుర్తుకు రాదు. మరోవైపు ప్రధాన క్రికెటర్ బ్యాటింగ్ లేదా బౌలింగ్ చేస్తుంటే బెట్టింగ్ మొత్తానికి హద్దు ఉండదని పలువురు బెట్టింగ్‌రాయుళ్లే చెబుతున్నారు. ఉదాహరణకు వంద రూపాయలు బెట్టింగ్ ఆడితే గెలిస్తే వంద రూపాయలు రెట్టింపు ఇచ్చేవారు. కానీ మ్యాచ్ ఆడే సమయంలో పరిస్థితులను బట్టి నిష్పత్తులు మారిపోతున్నాయి. ఒకటికి రెండు, ఒకటికి మూడు సైతం పెట్టడానికి వెనుకంజ వేయడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోయి యువకులు అప్పులపాలై ఇంటిలో తల్లిదండ్రులకు తెలిస్తే మందలిస్తార న్న భయంతో కొందరు ఊరు వదిలి పారిపోతున్నారు. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొందరు బరితెగించి దొంగతనాలకు సైతం పాల్పడుతున్నారు. యాడికి మండలకేంద్రంతోపాటు రాయలచెరువులో ఐపీఎల్ బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. టీకేఫ్‌లను వేదికలుగా చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మండలకేంద్రంలోని ఒక ప్రజాప్రతినిధి కార్యాలయం వెనుక భాగాన ఉన్న వెంచర్‌లో యువత ఎక్కువగా చేరి డిన్నర్‌లు ఏర్పాటు చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సమాచారం. మరోవైపు రాయలచెరువులోని ఒక డాబా వద్ద యువకులు పెద్దఎత్తున చేరి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సమాచారం.

బానిసలుగా మారుతున్న యువత

సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో యువకులు క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలుగా మారుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని టీస్టాళ్లు, లాడ్జీలు, పట్టణ సమీపంలో నూతనంగా ఏర్పడ్డ టీకేఫ్‌లను వేదికలుగా ఎంచుకుంటున్నారు. కొందరు అయితే సేఫ్టీ కోసం ఐపీఎల్ సీజన్ ముగిసే వరకు గదులను అద్దెకు తీసుకొని బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగియడంతో కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తున్నారని తల్లిదండ్రులు అనుకుంటుంటే వారు మాత్రం సులువుగా డబ్బులు సంపాదించడానికి అక్రమ మార్గాలు ఎంచుకుంటు న్నారన్న విమర్శలున్నాయి. పలువురు ఉద్యోగులు సైతం ఈ ఐపీఎల్ ఫీవర్‌కు దెబ్బతిన్నారు. రెండేళ్లక్రితం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ల్లో ఒక ఉపాధ్యాయుడు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించా లన్న దురాశతో తన వద్ద ఉన్న డబ్బులను మొత్తం బెట్టింగ్ ఆడాడు. అంతటితో ఆగకుండా బంధువులు, స్నేహితులతోపాటు అందిన ప్రతి చోటా అధికవడ్డీలకు అప్పులు చేసి బెట్టింగ్ ఆడాడు. చివరికి నష్టాలపాలై రుణదాతల నుంచి ఒత్తిళ్లు రావడంతో రాత్రికి రాత్రి ఊరువిడిచి వెళ్లిపోయాడని ఆరోపణలు ఉన్నాయి.



ఎన్నికల సాకుతో కన్నెత్తిచూడని పోలీసులు

ఐపీఎల్ దెబ్బకు జీవితాలు నాశనమై కుటుంబాలు రోడ్డున పడుతుంటే పోలీసులు మాత్రం ఎన్నికలను సాకుగా చూపుతూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పట్టణంలోని ప్రధాన టీస్టాళ్లు, కాఫీ బార్లలో విచ్చలవిడిగా బెట్టింగ్‌లు జరుగుతున్నా తమకేమి పట్టనట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మ్యాచ్‌లో ప్రారంభమై ఇరవై రోజులు గడిచినా నామమాత్రపు దాడులు కూడా పోలీసులు నిర్వహించడం లేదంటే అసాంఘిక కార్యకాలపాలపై వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభమైతే వరుసగా లాడ్జీలు, టీస్టాళ్లు తదితర బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు దాడులు జరిపేవారు. ఈ దెబ్బకు కొన్నిరోజులు బెట్టింగ్‌లకు ఫుల్‌స్టాప్ పడేది. కానీ ఈ సారి మాత్రం అలాంటి ఏవీ పట్టించుకోకుండా కేవలం ఎన్నికల విధులే తమ ముఖ్యమన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల సరిగా వ్యవహరించి ఈ ఐపీఎల్ బెట్టింగ్‌ను నియంత్రించకపోతే ఈ సీజన్‌లో కోట్లలో డబ్బులు చేతులు మారి ఎందరి జీవితాలు నాశనమవుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా పెడుతున్నాం




ఐపీఎల్ బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక నిఘా పెట్టాం. లాడ్జీలు, టీహోటళ్లవద్ద సిబ్బంది ద్వారా నిఘా ఉంచాం. ఆన్‌లైన్ బెట్టింగ్ పై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఏం చేస్తున్నారో గమనిస్తూ ఉండాలి.

- మురళీకృష్ణ, సీఐ



గరుడ వాహనంపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి

కసాపురం ఆలయం ఎదుట గ్రామోత్సవం



కన్నుల పండువగా గ్రామోత్సవం

గుంతకల్లు, ఏప్రిల్9: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి దేవస్థానంలో స్వామివార్ల గ్రామోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో మంగళవారం తెల్లవారుజాము 4 గంటలకు సుప్రభాతసేవ, మహాభిషేకం, స్వర్ణకవచాలంకరణ, పుష్పాలంకరణ, ప్రాతఃకాల అర్చన, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుందరకాండ, వేద పారాయణాలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం పంచాంగ శ్రవణం అనంతరం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి వార్లను గరుడ వాహనంపై ఆశీనులను గావించి, అలంకారాలు చేశారు. ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

ఊరంతా సందడి

ఘనంగా ఉగాది

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9: తెలుగువారి నూతన సంవత్సరం ఉగాదిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. క్రోధి నామ సంవత్సరం ఆరంభం సందర్భంగా మంగళవారం పలు ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వేద పండితులు పంచాంగ పఠనం చేశారు. ఇళ్లలో కూడా వేకువజాము నుంచే ఉగాది సందడి మొదలైంది. ప్రజలు ఇల్లూ వాకిలి అందంగా అలంకరించుకున్నారు. గుమ్మాలకు మామిడి తోరణాలు, వేప మండలు కట్టారు. నూతన వస్త్రాలు ధరించి, పిండివంటలు ఆరగించి ఆనందంగా గడిపారు. అనంతరం తమకు ఈ ఏడాది ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి దేవాలయాలకు వెళ్లి పంచాంగం విన్నారు.

అనంతపురం రామ్‌నగర్ రామాలయంలో కోదండరాములవారు



ఆధారాలున్నా.. అలసత్వమే!

ఫీల్డ్ అసిస్టెంట్లపై జిల్లా అధికారికి అవ్యాజమైన ప్రేమ

- ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదంట!
- అలా వివరణ ఇవ్వాలని నోటీసులు
- అధికార పార్టీకి డ్వామా అధికారుల వత్తాసు
- ఎన్నికల సంఘం ఆదేశాలు బేఖాతర్



డ్వామా కార్యాలయం

వెస్ట్ నరసాపురంలో వైసీపీ నేత ప్రచారంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ (ఫైల్)



నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులతో సరి

సార్వత్రిక ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొన్న నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించలేదు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రచారంలో పాల్గొన్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించకపోగా ఆ ఉద్యోగులకు బాసటగా నిలవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. కూడేరు మండలం మరుట్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ బయపురెడ్డి, రాప్తాడు మండలం గాండ్లపర్తి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, శింగనమల మండలం గురుగుంట్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్ రెడ్డి, వెస్ట్ నరసాపురం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌లను తొలగించాలని ఫొటో ఆధారాలతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎన్నికల సంఘం నిబంధనలు, ఆదేశాలు బేఖాతర్ చేస్తూ డ్వామా అధికారులు ఆ ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించలేదు. అక్కడితో ఆగక...ఆ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొనలేదని, వచ్చిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు.

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: అధికార పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై జిల్లా అధికారి అవ్యాజమైన ప్రేమ చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తే వెంటనే వారిని విధుల నుంచి తప్పించాలనే నిబంధనకు తూట్లు పొడుస్తున్నారు. ఎన్నికల్లో శింగనమల, రాప్తాడు, ఉరవకొండ ప్రాంతాల్లో అధికార పార్టీ అభ్యర్థుల తరఫున ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం వారిని గుర్తించి వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని డ్వామా అధికారులను ఆదేశించింది. అయితే ఆ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారంలో పాల్గొనలేదని, అవన్నీ పాత ఫొటోలు అని వివరణ ఇవ్వండి అంటూ డ్వామా అధికారులు బాధ్యులైన ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చారు. ఇదంతా ఎన్నికల సంఘాన్ని బురిడీ కొట్టించడానికే అనే విమర్శలు ఆశాఖలో వ్యక్తం అవుతున్నాయి.

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ప్రచారం

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధికార వైసీపీ వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా తన చేతిలో ఉన్న అన్ని వనరులను వాడుతోంది. ఈక్రమంలోనే గ్రామీణ ప్రజలతో మమేకమైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఎన్నికల ప్రచారానికి వాడుకుంటోంది. క్షేత్రస్థాయిలో ప్రజలను మభ్యపెట్టేందుకు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎర వేస్తున్నారు. ఇదంతా జిల్లా యంత్రాంగం పరిశీలిస్తోందా లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. శింగనమల, కళ్యాణదుర్గం, తాడిపత్రి, రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో అధికంగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఆయా సంఘటనలపై అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రజలతో నేరుగా క్షేత్రస్థాయిలో సంబంధాలు ఉండే ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

ఉష్ణోగ్రతలు	(మంగళ)
గరిష్ఠం	40.0
కనిష్ఠం	27.0

చీనీకాయలు టన్ను రూ.36 వేలు



అనంతపురంరూరల్, ఏప్రిల్ 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.21 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 355 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	బుధవారం సాయంత్రం	06:34

రియల్ దందా



లే అవుట్‌లో వేసిన తారు రోడ్డు

- రాయదుర్గం నలుమూలలా విస్తరణ
- ఐదేళ్లలో యాభైకిపైగా అక్రమ లే అవుట్లు
- ప్లాట్ల వ్యాపారంతో ఆర్థికంగా బలపడ్డ వైసీపీ నాయకులు
- రియల్ ఎస్టేట్ ద్వారా రూ.312.60 కోట్ల టర్నోవర్
- అనుమతులు లేకనే రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రాయదుర్గం, ఏప్రిల్ 9: అధికారం అండతో వైసీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని మాఫియాలా నడిపించి కోట్లు కొల్లగొట్టారు. కొందరు ప్రభుత్వ అధికారులు ముడుపులు పుచ్చుకుని మిన్నకుండిపో యారు. దీంతో రాయదుర్గం పట్టణం చుట్టూ అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అది ఏభూమి అయినా కానీ దర్జాగా చదును చేయడం, రాళ్లను పాతడం, ప్లాట్లుగా విడగొట్టి, ఆకట్టుకునే విధంగా ఒక పేరు పెట్టి వెంచర్‌ను చూపుతూ బ్రోచర్‌ను మార్కెట్‌లో వదిలేయడం. ప్రభుత్వానికి నామమాత్రపు పన్నులు చెల్లించి, అక్రమ లేఅవుట్ల ద్వారా జేబులు నింపుకున్నారు. ఇలా ఐదేళ్లపాటు వైసీపీ నాయకులు రియల్ వ్యాపారాన్ని జోరుగా నిర్వహించి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. రాయదుర్గం అర్బన్‌లోనే సుమారు 50కు పైగా అక్రమ లేఅవుట్లు వేసి రూ. 312.60 కోట్ల టర్నోవర్ చేశారని ప్రాథమిక అంచనా. రియల్ అక్రమ దందాతో 2019లో సామాన్య వైసీపీ కార్యకర్తలుగా ఉండి ఆర్థికంగా బలహీనులుగా ఉన్న వారంతా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చొరబడి అక్రమ లేఅవుట్లు వేసి కోట్లు సంపాదించారు. వారంతా ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థికి వెన్నంటి ఉంటూ, మరో ఐదేళ్ల అవకాశం కోసం నానా అవస్థలు పడుతున్నారు. అయితే అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు మాత్రం ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే మున్సిపాల్టీ అనుమతి కోసం జేబుకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వెంచర్‌కో రేటు

సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వ్యవసాయభూములను కొనుగోలు చేసి వెంచర్‌లుగా వేసుకుంటారు. ఇక్కడ వెంచర్ వేయాలంటే ముందుగా వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. అందుకు రెవెన్యూ అధికారులకు పన్ను చెల్లించాలి. అయితే అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుతో పాటు అధికారులకు రెండింతలు చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడే అనుమతులు లభిస్తాయని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తెలిపారు. అంతే కాకుండా రెవెన్యూ రికార్డులలో భూమికి సంబంధించి చిక్కులు ఉన్న వాటిని క్లియర్ చేసేందుకు కూడా ఒక రేటు మాట్లాడుకుని వ్యాపారానికి ఆటంకం లేకుండా ముందుకు వెళతారు. ప్రస్తుతం వేసిన లేఅవుట్‌లలో చాలా వరకు నాన్‌అగ్రికల్చర్‌గా మార్చుకుని వేసినవే. వ్యవసాయేతర భూమిగా మార్చిన అనంతరం అందులో పరిశ్రమల నిర్మాణమా, నివాస గృహాల నిర్మాణమా అనే విషయం మాత్రం ఆ సర్వే నంబర్లపై ఉండదు. దీంతో మున్సిపల్ యంత్రాంగం ఈ వ్యవహారాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా అధికారపార్టీ నాయకుల పైరవీలతో వ్యాపారానికి సంబంధించిన వ్యవహారాలన్నీ సజావుగా సాగిపోతాయి. ముడుపుల మత్తులో ఉన్న కొందరు అధికారులు కళ్లముందే అక్రమ లేఅవుట్లు కనిపిస్తున్నా వాటిని టచ్ చేసే సాహసం చేయరు. దేవదాయశాఖ వివాదాలున్న భూముల్లో కూడా వైసీపీ నాయకులు చక్రం తిప్పి దండుకున్నారు.

అక్రమ రోడ్లు, విద్యుత్ కనెక్షన్లు

అక్రమ లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్ స్తంభాలు కూడా అక్రమంగానే వేసేస్తారు. మున్సిపల్ కార్యాలయంలో అక్రమ లేఅవుట్ల వివరాలు ఏమాత్రం ఉండవు. దీంతో పాటు రోడ్లు ఎక్కడ ఉన్నాయనే విషయం కూడా వారికి తెలియదు. కానీ ఈ అక్రమ లేఅవుట్లలో మాత్రం ఆర్‌అండ్‌బీ రహదారులకు తీసిపోనట్లుగా తారురోడ్లు ఉంటాయి. దీంతో పాటు వీధి దీపాలు వెలగడానికి అవసరమైన విద్యుత్ స్తంభాలు కూడా సిద్ధంగా ఉంటాయి. లేఅవుట్లలో అక్రమంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయనే విషయాన్ని మాత్రం పట్టించుకునే పరిస్థితిలో ఉండరు. అనుమతులు తీసుకొని రోడ్లు వేయాలన్నా, విద్యుత్ స్తంభాలు నాటాలన్నా ఆయా శాఖలకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. వాటన్నింటిని ఎగ్గొట్టి అధికార దర్పాన్ని ప్రయోగించి దోచుకోవడమే లక్ష్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ఎంచుకున్నారు.

వైసీపీ కీలక నేతలే రియల్టర్లు

వైసీపీ కీలక నేతలే రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవతారమెత్తి కోట్లు గడిస్తున్నారు. ముఖ్యంగా రాయదుర్గం నుంచి అనంతపురం వెళ్లే మార్గంలో వేసిన మూడున్నర ఎకరాల అక్రమ లేఅవుట్‌లో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి భాగస్వామిగా ఉన్నారని ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్పకు సమీప బంధువు కీలక పాత్ర పోషించి ఎకరా రూ. 2.25 కోట్లతో కొనుగోలు చేసి సెంటు రూ. ఆరు లక్షల ప్రకారం ప్లాట్లను విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీని ప్రకారం ఎకరాను దాదాపు రూ. 4 కోట్ల దాకా ప్లాట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. బీటీపీ రోడ్డులో మున్సిపల్ ప్రజా ప్రతినిధి ఎకరా రూ. కోటి ప్రకారం కొనుగోలు చేసిన నాలుగు ఎకరాల భూమిలో అక్రమ లేఅవుట్ వేసి ప్లాటు రూ. నాలుగు లక్షల ప్రకారం విక్రయిస్తు న్నారు. దీన ప్రకారం ఎకరాపై రూ.60 లక్షలకుపైగా ఆదాయం వస్తోంది. ఆదే రోడ్డులో వైసీపీ నామినేటెడ్ పదవి పొందిన నాయకుడు ఎకరా భూమిని రూ. కోటితో కొనుగోలు చేసి ప్లాటు రూ. ఐదు లక్షల ప్రకారం విక్రయిస్తున్నారు. సుమారు రూ.కోటికిపైగా ఆదాయం రానున్నట్లు బహిరంగంగా వినిపిస్తోంది. బళ్లారిరోడ్డులో ఎకరా రూ. 70 లక్షల ప్రకారం మూడున్నర ఎకరాలు కొనుగోలు చేసి రూ.1.5 కోట్లకు ప్లాట్ల రూపంలో విక్రయించారు. ఎన్నికల హడావుడి ఉండగానే వెంచర్లు వేయడానికి భూమి కొనుగోలు చేస్తున్నారు. కొందరు వైసీపీ నాయకులు సమష్టిగా ఏర్పడి అడిగుప్పరోడ్డుకు 14 ఎకరాల భూమిని రూ. కోటి ప్రకారం ఎకరా కొనుగోలు చేసి అందులో ఉన్న చింతచెట్లను తొలగించి వెంచర్ వేయడానికి సన్నద్ధం అవుతున్నట్లు చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. దీని ప్రకారం అక్రమ లేఅవుట్‌ల దందాలో వైసీపీ నాయకుల దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో తెలిసిపోతోంది.

కోట్లలో టర్నోవర్

అక్రమ లేఅవుట్ల వ్యాపారంలో గడచిన ఐదేళ్లలో రూ. 312.60 కోట్లకుపైగా టర్నోవర్ చేసి కోట్లలో లాభాలు ఆర్జించారు. ప్రతి ఏడాది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా మాత్రమే రూ. 10 కోట్ల దాకా పన్ను వసూలు అవుతోంది. ప్లాట్ల కొనుగోలుదారులు ఏడు శాతం ప్రకారం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. దీంతో ఐదేళ్ల కాలంలో రూ. 50 కోట్ల దాకా ప్రభుత్వానికి అక్రమ లేఅవుట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు అయినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం పరిశీలిస్తే అక్రమ లేఅవుట్ల నుంచి ఏ స్థాయిలో వైసీపీ నాయకులు దండుకున్నారో స్పష్టమవుతోంది.

గుమ్మఘట్ట రోడ్డులో వేసిన అక్రమ లేఅవుట్




ఎన్నికల మస్కట్ రూపొందించండి

ఎంపికైన మస్కట్‌కు రూ.5వేలు బహుమతి.. కలెక్టరు వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 9: ఎన్నికల మస్కెట్ రూపకల్పనలో జిలాకు చెందిన అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కల్పించడానికి స్వీప్ యాక్టివిటీలో భాగంగా ఈమస్కెట్ రూపకల్పన పోటీలు చేపడుతున్నామన్నారు. జిల్లా ప్రధాన పంటలు, జానపద సాహిత్యం ప్రతిబింబించేలా మస్కెట్‌ను రూపొందించాల న్నారు. ప్రధానంగా వేరుశనగ, అరటి, తీపినారంజ, పొద్దుతిరుగుడు తదితర పంటలు, గొర్రెలు, మేకలు, అనంత జానపదసాహిత్యం నుంచి ఏదేనా ఆకర్షణీయమైన పాత్రలు ఉపయోగించి ఎన్నికల మస్కెట్ రూపొందించాలని సూచించారు. ఈపోటీలలో పాల్గొనడానికి ఈనెల 13 వరకు అవకాశం ఉందన్నారు. టాప్-3 ఎంట్రీలను జిల్లా ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తామన్నారు. ఎంట్రీలను ఏటీపీ ఎలక్షన్ మస్కెట్, జీమెయిల్ డాట్ కామ్ అనే ఐడీకి పేరు, మొబైల్ నెంబరు, చిరునామాతో కూడిన వివరాలను నమోదు చేసి పంపవచ్చన్నారు. ఎంపికైన మస్కట్‌కు రూ5వేలు బహుమతి , ప్రశంసా పత్రం అందిస్తామని వివరించారు. ఈ పోటీలో జిల్లా ప్రజలు, డ్రాయింగ్ క్రాఫ్ట్ టీచర్లు, ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, ఎస్కేయూ, సెంట్రల్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ విద్యార్థులు, కార్టూనిస్టులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టరు పిలుపునిచ్చారు. సమాచారం కోసం 9177101476 నెంబరును సంప్రదించాలని తెలిపారు.



సరెండర్ సెలవుల సంకటం..!

ఈఎల్స్‌ను సరెండర్ చేసిన టీచర్లు.. ఒక్కొక్కరికి లక్షలాది రూపాయలు పెండింగ్





ఎర్రగుంట హైస్కూల్‌లో పనిచేసే ఓ స్కూల్ అసిస్టెంట్ 2023లో ప్రమోషన్‌కు మరో స్కూల్‌కు వెళ్లాడు. ఆయన గతంలో నార్పలలో పనిచేయగా.... నవంబరు 2022లో ఈఎల్స్‌ను సరెండర్ చేశారు. ఇప్పటి వరకూ ఆయనకు డబ్బు జమ కాలేదు. దర్గాహోన్నూరు, నెరమెట్ల తదితర స్కూళ్లలో పనిచేసే పలువురు టీచర్లకు రెండేళ్లుగా సరెండర్ సెలవుల డబ్బు జమకాలేదు.

జిల్లాలోని బొమ్మనహాళ్, డీ హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, కంబదూరు ఇలా అనేక మండలాల్లోని వేలాది మంది ఉపాధ్యాయులు అప్లై చేసినా సరెండర్ సెలవుల డబ్బు రెండు, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంది.

అనంతపురం విద్య, ఏప్రిల్ 9 : జగన్ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ముందు చూస్తే నుయ్యి... వెనుక చూస్తే... గొయ్యి అన్న చందంగా మారింది. సరెండర్ సెలవులకు సంబంధించిన డబ్బు అటు ఖాతాలకు జమ కాక.. ఇటు వాడుకోడానికి వీల్లేకుండా పోయింది. వేలాది మంది ఉపాధ్యాయులు తమ హక్కుగా భావించే సరెండర్ లీవ్స్ డబ్బుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. కొందరికి రెండేళ్లుగా... మరికొందరికి మూడేళ్లుగా డబ్బులు జమ కావడం లేదు. దీంతో చాలా మంది ఇప్పటికే అప్లై చేసిన సరెండర్ సెలవులపై ఆశలు వదులుకున్నారు. ఆఖరికి సరెండ్ సెలవుల అప్లై చేయడమే ఈ ప్రభుత్వంలో దండగా అంటూ ఉపాధ్యాయులు నిట్టూరుస్తున్నారు.

ఎప్పుడిస్తారో....?

ఉపాధ్యాయులకు, ఇతర శాఖల ఉద్యోగులతో పోలిస్తే... సంపాదిత సెలవులు చాలా తక్కువ. వెకేషన్ డిపార్టుమెంట్‌కు చెందిన టీచర్లకు ఏడాదికి ఆరు రోజుల సెలవులు ఇస్తే... నాన్ వెకేషన్ డిపార్టుమెంట్ ఉద్యోగులకు ఏడాదికి 30 వరకూ వస్తాయి. జిల్లా వ్యాప్తంగా రెండు డివిజన్లలో 1659 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 8,643 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, మున్సిపల్ ఇతర ప్రభుత్వ రంగ యాజమాన్యాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఏడాదికు సుమారు 6 వరకూ ఈఎల్స్ వస్తాయి. ఉపాధ్యాయులకు జమ అయిన సెలవులను ప్రభుత్వానికి సరెండర్ చేయడం ద్వారా ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రభుత్వం వచ్చాక... చాలా మంది ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం సరెండర్ సెలవులు అప్లై చేశారు. కొందరు 15 రోజుల, మరికొందరు 30 రోజులను అప్లై చేశారు. అయితే ఉపాధ్యాయులు అప్లై చేసిన సరెండర్ సెలవుల డబ్బులు నేటికీ పడలేదు.



వేలాది మంది ఉపాధ్యాయులకు రెండేళ్లు, మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. వందల కోట్ల రూపాయలు సరెండర్ సెలవులు డబ్బులను జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. దీంతో అటు సరెండర్ సెలవుల డబ్బులు జమ కావడం లేదు. మరోవైపు....ఆ సెలవులు సర్వీస్ రిజిస్టర్‌లో రికార్డు కావడంతో... వాటిని వాడుకోడానికి వీలులేక ఆ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అవసరాలకు అప్లై చేస్తే.. డబ్బులు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఆఖరికి ఉపాధ్యాయులు చేతిలో ఉన్న ఈఎల్స్‌ను సరెండర్ చేయడానికి కూడా వెనకాడుతున్నారు. అప్లై చేస్తే.... డబ్బులు పడవని, పైగా వాటిని వాడుకోడానికి కూడా అవకాశం లేకుండా పోతోందని, ఈ ప్రభుత్వంలో సరెండర్ సెలవుల జోలికే వెళ్లకపోవడం మేలు అంటూ... ఉపాధ్యాయులు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెలవులు ఎన్‌క్యాష్ కావడం లేదు



ప్రతినెలా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికే ప్రభుత్వం ఇబ్బందులు పడుతోంది. టీచర్లు, ఉద్యోగులకు గతంలో సరెండర్ సెలవులు అప్లై చేస్తే... పూర్తిస్థాయిలో పడేది. ఇప్పుడు రెండేళ్లు, మూడేళ్లుగా చెల్లింపులు కావడం లేదు. దీంతో జీతం వస్తే చాలు అనేస్థాయికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు వెళ్లారు. గతంలో సరెండర్ లీవ్స్ పెట్టిన బిల్లులకు ఇప్పటి వరకూ జమ కావడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల సమస్యలు గుర్తించి చెల్లింపులు చేయాలి.

- రవీంద్ర, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం సుమారు రెండు, మూడేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరెండర్ సెలవుల డబ్బులు జమ చేయడం లేదు. జిల్లాలో వందలాది మంది ఉపాధ్యాయులు ఈఎల్స్ క్లైమ్ చేశారు. కానీ డబ్బుల కోసం ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం డబ్బులను ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలి

- గోవింద్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రెండు, మూడేళ్లుగా బిల్స్ పెండింగ్...



చాలా మంది ఉపాధ్యాయులు ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు బదిలీ అయ్యారు. వారి కేడర్ మారింది. గతంలో ఎస్‌జీటీలగా ఉన్న వాళ్లు ప్రమోషన్లపై స్కూల్ అసిస్టెంట్లు అయ్యారు. అప్పట్లో అప్లై చేసిన వాళ్లకు ఇప్పటి వరకూ డబ్బులు జమ కాలేదు. రెండు, మూడేళ్లుగా బిల్స్ పెండింగ్‌లో ఉంచడం సరికాదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- విజయభాస్కర్, ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు

ఎన్నికల ప్రచారంలోకి బాలయ్య

12న కదిరిలో సైకిల్ రావాలి యాత్ర



పుట్టపర్తి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 'సైకిల్ రావాలి' యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఈనెల 12న కదిరిలో సైకిల్ రావాలి యాత్ర ప్రారంభిస్తారు. అదేరోజు మధ్యాహ్నం పుట్టపర్తిలో, సాయంత్రం అనంతపురం నగరంలో రోడ్‌షో చేయనున్నారు. బహిరంగ సభల్లో ప్రసంగించి శింగనమలలో బస చేస్తారు. రెండో రోజు శింగనమల, తాడిపత్రిలో యాత్ర కొనసాగిస్తారు. అక్కడి నుంచి నంద్యాల జిల్లాలోకి ప్రవేశించి, బనగానపల్లెలో బస చేస్తారు. సైకిల్ యాత్రలో రోడ్‌షోతోపాటు బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని టీడీపీ వర్గాలు తెలిపారు.

స్టాక్‌పాయింట్‌లో అగ్ని ప్రమాదం

150 బస్తాల సబ్సిడీ బియ్యం దగ్ధం

బుక్కపట్నం, ఏప్రిల్ 9: స్థానిక కోటవీధిలోని పౌరసరఫరాల శాఖ స్టాక్ పాయింట్‌లో మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయి. 150 బస్తాల బియ్యం కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. స్టాక్‌పాయింట్ నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాలకు పీడీఎఫ్ బియ్యం సరఫరా చేస్తారు. మంగళవారం రాత్రి స్టాక్‌పాయింట్‌కు ఒక వైపు నిప్పు అంటుకుంది. దట్టమైన పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి, బుక్కపట్నం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సురేష్‌బాబు.. సిబ్బందితో గోడౌన్ వద్దకు చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. గోడౌన్‌కు ఒక వైపు షట్టర్ వద్ద కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, అగ్గిపెట్టెలు కనిపించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయా, ఎవరైనా అంటించారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్డీఓ, డీఎస్పీ పరిశీలన

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గోడౌన్‌ను పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్, సీఐ రాగిరి రామయ్య పరిశీలించారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, నిజాలను నిగ్గు తేలుస్తామని డీఎస్పీ తెలిపారు.



కాలిపోయిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజీనామాల వెనుక..!

వలంటీర్లపై వైసీపీ కుతంత్రాలు

ప్రచారాస్త్రాలుగా వినియోగించుకునే ఎత్తుగడ

రాజీనామా చేయించి రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు

వైసీపీ నాయకులే జీతాలు చెల్లించేలా ఒప్పందాలు?



కొత్తచెరువు ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు (ఫైల్)

ధర్మవరం, ఏప్రిల్ 9: వలంటీర్లపై వైసీపీ కుతంత్రాలు పన్నుతోందా... వారిని పావులా వాడుకునే ఎత్తుగడ వేస్తోందా.. అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగానే వారితో రాజీనామాలు చేయిస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు సాక్ష్యాత్తు సీఎం జగన్ సైతం 'రాజీనామాలు చేయండి.. ఎన్నికల్లో గెలిస్తే మీకు మొదటి ప్రాధాన్యత ఇస్తానం'టూ బహిరంగ సభలు, సమావేశాల్లో పేర్కొనడం గర్హనీయం. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను వినియోగించుకుని ప్రజలకు సంబంధించిన పూర్తి సమాచారాన్నివారి ద్వారా సేకరించారు. ఎవరు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నారో, అధికార పార్టీతో లబ్ధిపొందుతున్న ప్రజల్లో పార్టీ పట్ల ఎలాంటి సానుభూతి ఉందన్న అంశాలను సైతం ఇప్పటికే ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు సేకరించినట్లు సమాచారం. అధికార పార్టీ పెద్దలు రానున్న ఎన్నికల్లో ఎలాగైనా వలంటీర్లను ఉపయోగించుకోవాలని ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వారికి తాయిళాలను సైతం అందించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వోద్యోగులు, వలంటీర్లు, చౌకధాన్యపు డిపో డీలర్లు, ఇతర ఉద్యోగులు పాల్గొనరాదని ఎన్నికల సంఘం ఆదేశించినా.. వాటిని బేఖాతరు చేస్తూ అధికార పార్టీ నాయకులు నిర్వహించే ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో ఎన్నికల సంఘం, అధికారులు సీరియస్‌గా తీసుకుని, వారిపై వేటు వేస్తున్నారు. అయినా గుట్టుగా పాల్గొంటూ ప్రచారాలు సైతం చేస్తుండడం శోచనీయం.

రాజీనామాలు చేయండి...

శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటికే వలంటీర్లు.. అధికార పార్టీ నాయకుల ప్రచారాల్లో కార్యకర్తల్లా పాల్గొంటున్నారు. పరోక్షంగా పథకాల పేరుతో ప్రజలను ప్రలోభాలకు లోను చేస్తున్నారు. వారు విధుల్లో ఉండి ప్రచారం చేయడం నియమావళికి విరుద్ధం కావడంతో వైసీపీ కొత్త వ్యూహం తెరపైకి తీసుకొచ్చింది. వలంటీర్లతో రాజీనామా చేయించి, ఎన్నికల ప్రచార రంగంలోకి దింపేందుకు ఏర్పాట్లను చేసుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా నెలజీతం తామే ఇస్తామనీ, ప్రచారంలో పాల్గొనాలంటూ ప్రభుత్వ పెద్దలు సూచించినట్లు తెలుస్తోంది. జిల్లాలో 5 వేలకు పైగా వలంటీర్లు పనిచేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వపెద్దల ఆదేశాలతో సగంమందికిపైగా వలంటీర్లు రాజీనామాలు చేసి, రాజకీయ ప్రచారంలో పాల్గొంటున్నారు. మిగిలిన వారు కూడా త్వరలో రాజీనామాలు చేయనున్నట్లు సమాచారం.

ఓటర్లను ప్రలోభపెడుతూ..

చాలాచోట్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు.. వృద్ధులు, దివ్యాంగులకు వచ్చేది వైసీపీ ప్రభుత్వమేననీ, పార్టీకి ఓటు వేయకపోతే తామే వలంటీర్లుగా ఉంటామనీ, పింఛన్‌తోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను రాకుండా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం.

పోలింగ్ ఏజెంట్లుగా..

ఎన్నికల సంఘం.. వలంటీర్లను రాజకీయంగా వాడుకోకూడదని ఆదేశాలు జారీ చేసింది. సీఎం జగన్.. వలంటీర్లను రాష్ట్ర వ్యాప్తంగా రాజీనామాలు చేయించి, వారికి వార్డుల్లో రాజకీయ బాధ్యతలు అప్పజెప్పనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. వారిని పోలింగ్ ఏజెంట్లుగా వినియోగించుకోవడం ద్వారా ఆ వార్డుల్లో ప్రజలు ఎవరు, ఏ పార్టీకి ఓటు వేస్తున్నారోనన్న దానిపై నిఘా ఉంచవచ్చన్న ఆలోచనలో వైసీపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం.

ఉపాధి నిధులు స్వాహా?

అధికారపార్టీ నేతల కనుసన్నల్లో మస్టర్లు

బోగస్ హాజరు ద్వారా రూ.10కోట్ల నిధుల మేత?

ఈ ఏడాది కూలీలకు తగ్గిన పనిదినాలు

రోజుకు 8 వేలే నమోదు



ఎండలోనే పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: జిల్లాలో ఉపాధి కూలీల నిధులు స్వాహా చేశారు. అధికార పార్టీ నేతలతో కలిసి అధికారులు, సిబ్బంది కోట్ల మేర నిధులను కాజేశారు. నకిలీ రికార్డులు సృష్టించి ప్రభుత్వ సొమ్ము కొల్లగొట్టారు. ఇందుకు ఉపాధి సిబ్బంది సైతం ఇతోధికంగా సహకరించడం గమనార్హం. ఉపాధి కూలీల హాజరు నమోదుకు సంబంధించి బోగస్ మస్టర్లు కూడా అధికార పార్టీ నేతల ఇళ్లలో వేసినట్లు సమాచారం. కాగా వేసవి సీజన్ ప్రారంభమైనా రోజుకు 8వేల పనిదినాలు మాత్రమే నమోదవుతున్నాయి. ఇందులోనూ సుమారు 5వేల వరకు బోగస్ మస్టర్లుగానే ఉన్నట్లు సమాచారం. గతేడాది ఇదే సమయానికి 30వేల వరకు సగటున పనిదినాలు నమోదు చేశారు. మరి గతేడాదికి ఈ ఏడాదికి ఇంత తేడా ఎందుకొచ్చిందో అధికారులకే తెలియాలి.



డ్వామా కార్యాలయం

శింగనమలలో నిధుల స్వాహా.. ఓ ఉదాహరణ

శింగనమలలో ఉపాధి నిధుల స్వాహా వెలుగు చూసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి స్వయాన మామ అయిన డీసీఎంఎస్ డైరెక్టర్, శింగనమల సహకార సొసైటీ అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి పేరుతో రూ.7లక్షలు వరకు ఉపాధి నిధులు కాజేశారు. జాబ్‌కార్డు నంబరు 121711113016020184తో సీసీ రోడ్డు నిర్మాణం, ఉపాధి పథకంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా 7ఎకరాల్లో చీనీ సాగు చేసినట్లు నిధులు డ్రా చేశారు. ఇలా సీసీ రోడ్డు, మొక్కలు నాటడం, తప్పుడు మస్టర్ల ద్వారా సుమారు రూ.7లక్షలు వరకు నిధులు కాజేశారు. ఇదిలా ఉంటే అధికారపార్టీ నేతల ఇళ్లలోనే ఉపాధి కూలీల బోగస్ మస్టర్లు వేసి నిధులు కాజేయడం పనిగా పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు నడుస్తోంది. ఇందుకు ఉపాధి ఏపీఓలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు సహకరిస్తుండడం గమనార్హం. పైగా తమకు సహకరించకుంటే మీ ఉద్యోగులు ఊడతాయంటూ ఉపాధి సిబ్బందికి అధికారపార్టీ నేతలు హెచ్చరికలు చేస్తుండడం ఆందోళన కలిగించే అంశం. జిల్లా వ్యాప్తంగా బోగస్ మస్టర్ల ద్వారా ఈ ఏడాది రూ.10 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది.

పడిపోయిన ఉపాధి పనిదినాలు

ఉపాధి కూలీలలకు వేసవి సీజన్ ప్రారంభమైంది. అయినా దినసరి కూలీల పనిదినాలు పెరగడం లేదు. ఈ సమయంలో గతేడాది 30వేలకు పైగా పనిదినాలు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది 8వేలు మాత్రమే నమోదు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో డ్వామా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఈ గణాంకాలే చెబుతున్నాయి. ఇలా నిర్లక్ష్యంగా ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించకపోతే పరిస్థితి మరింత దయనీయంగా మారే ప్రమాదం లేకపోలేదు.

పేదల సొమ్ము రికవరీ చేయాల్సిందే



కూలీల పేరుతో స్వాహా చేసిన పేదల సొమ్మును రికవరీ చేయాల్సిందే. అంతేగాక వైసీపీ నాయకులతో కలిసి బోగస్ మస్టర్లు నమోదు చేసిన ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి. తప్పుడు పనిదినాలతో పేదలకు అందాల్సిన సొమ్మును పెద్దలు దోచేయడం దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

- కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు

పని దినాలు పెంచాలి



జిల్లాలో ఉన్న ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలి. వేసవిలో రోజుకు కనీసం 30వేల పనిదినాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల్లో పని అడిగిన కూలీలకు పని చూపించడం లేదు. దీంతో స్థానికంగా పనులు లేక గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌కార్డు కలిగిన అర్హులైన అసలైన కూలీలు ఉపాధి కోసం పట్టణాలకు వలసబాట పడుతున్నారు. అయినా డ్వామా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఏమి పట్టించుకోవడం లేదు.

- నాగరాజు, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు

జాబ్‌కార్డు కలిగిన కూలీలకే పనులు



జాబ్‌కార్డు కలిగిన కూలీలకే ఉపాధి పనులు కల్పిస్తున్నాం. ఉపాధి నిధులు కూలీల బ్యాంకు అకౌంట్లలోకి ఆన్‌లైన్‌లో వేస్తున్నాం. ఇక ఎక్కడా ఉపాధి కూలీల సొమ్ము పక్కకు పోయేందుకు అవకాశమే లేదు. ఎక్కడైనా అలా అర్హత లేని జాబ్‌కార్డు కలిగి ఉండి నిధులు డ్రా చేసినట్లు జరిగితే, సామాజిక తనిఖీల ద్వారా గుర్తించి ఆ సొమ్మును సంబంధిత సిబ్బంది ద్వారా రికవరీ చేస్తాం. అంతేగాక అటువంటి సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. వేసవి సీజన్‌లో కూలీలు పని అడిగిన ప్రతిచోట ఉపాధి పనులు కల్పిస్తున్నాం.

- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ

మేము మారం..

పుట్టపర్తి, ఏప్రిల్ 9: ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఉద్యోగులు మేము మారమంటూ వైసీపీ కార్యక్రమాల్లో యథేచ్ఛగా పాల్గొంటున్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కొంతమంది ఆ పార్టీలో చేరారు. నల్లమాడ మండలం తిప్పయ్యగారిపల్లిలో వెలుగు యానిమేటర్‌గా పనిచేస్తున్న హరినాథరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఉద్యోగాల నుంచి తొలగించినా వారిలో మార్పు రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వైసీపీ కార్యక్రమంలో యానిమేటర్ హరినాథరెడ్డి (వృత్తంలో..)

ఎమ్మెల్యే దుద్దుకుంటపై కేసు నమోదు చేయాలి

● సత్యసాయి తాగునీటి దుర్వినియోగంపై మాజీ మంత్రి పల్లె ఆగ్రహం

పుట్టపర్తి, ఏప్రిల్ 9: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దొంగచాటుగా సత్యసాయి నీటిని తోటకు మళ్లించుకోవడంపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నల్లమాడ, ఓడీసీ, అమడగూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి వాటర్‌ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజల నీటిని దొంగచాటుగా తన తోటకు పైపులైన్ ద్వారా మళ్లించుకున్నారని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దుద్దుకుంట ఫౌండేషన్ ద్వారా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నానని గొప్పలు చెప్పుకుంటూ మరో పక్క ఏకంగా సత్యసాయినీటి చౌర్యానికి పాల్పడటం ఆయన దోపిడీకి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వాల్టా యాక్టు కింద కేసు నమోదు చేసుకుని ఇందులో భాగస్వాములైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. 190 చెరువులకు నీరు అందిస్తానని చెప్పుకుంటున్న ఘనుడు సామాన్యులకు ద్రోహం చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారుల దృష్టికి ఫిర్యాదు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

పలువురు నాయకులతో అంబికా భేటీ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9: అనంతపురం నగరంలోని పలువురు నాయకులతో మంగళవారం అనంతపురం పార్లమెంట్ కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, రాయల్ మురళి, మనోజ్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, క్రిసెంట్ ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్ట్ అధినేత కేఎం షకీల్ షఫీ తదితరులతో ఆయన భేటీ అయ్యారు. తన గెలుపునకు సహకరించాలని కోరారు.

13న కల్లూరుకు బాలకృష్ణ రాక

గార్లదిన్నె, ఏప్రిల్ 9: శింగనమల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ తరఫున ప్రచారానికి ఈనెల 13న హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వస్తున్నారు. బాలకృష్ణ పర్యటనకు శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో ప్రదేశాలను బండారు శ్రావణిశ్రీ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాబిన్ టీం సభ్యులు పరిశీలించారు. గార్లదిన్నె మండలం కల్లూరులోని నీలం సంజీవరెడ్డి సర్కిల్‌ను ఖరారు చేశారు. ఆ సర్కిల్లో బాలకృష్ణ రోడ్ షో చేపడతారని టీడీపీ నాయకులు తెలిపారు. బాలకృష్ణ పర్యటనకు టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

బీజేపీలో చేరిన మానవహక్కుల సంఘం నాయకులు



బీజేపీలోకి చేరిన మానవహక్కుల సంఘం నాయకులతో సత్యకుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: మానవ హక్కుల సంఘం నాయకులు బీజేపీలోకి చేరారు. మంగళవారం స్థానిక నగరంలో సోషియల్ అండ్ ఇంటర్నేషనల్ సివిల్-హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్‌ను బీజేపీ జాతీయ కార్యదర్శి, ధర్మవరం కూటమి అసెంబ్లీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రానికి, దేశానికి ఎన్‌డీఏ అవసరం ఉందని, తమవంతుగా అధికారంలోకి వచ్చేందుకు పనిచేస్తామని సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయనతో పాటు పలువురు యువకులు బీజేపీలోకి చేరారు.

ఘనంగా ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం



బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 9: శ్రీముసలమ్మ దేవత ఆలయ నాల్గో వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ముసలమ్మ కట్ట వద్ద ఉన్న అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారిని వివిధ పూలతో ప్రత్యేక అలంకరణ చేసి.. పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుశీలాదేవి, సూర్యనారాయణరెడ్డి వేలాదిమంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

నేడు జనసేన ఆత్మీయ సమావేశం



నాయకులు, కార్యకర్తలతో చర్చిస్తున్న వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 9: జనసేన ఆత్మీయ సమావేశాన్ని బుధవారం రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని, ఇందులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొంటారని జనసేక పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ తెలిపారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముందు ఉదయం 10 గంటలకు జూనియర్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, ప్రభుత్వాస్పత్రి రోడ్డు మీదుగా రాయల్ ఫంక్షన్ హాల్ వరకూ భారీ బైకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోండి: ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 9: అనంతపురం నగరంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగర పోలీసులను జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నగర పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, తాయిళాల ఎర చూపి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, నగర సీఐలు రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిశోర్, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా.. పట్టించుకునేవారేరీ...?

చెత్త తరలింపునకు మంగళం... వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు



హౌసింగ్‌బోర్డులో నివాసాల మధ్య నిల్వవున్న చెత్త

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: నగరంలో ప్రధాన కాలనీ అయిన హౌసింగ్ బోర్డులో ప్రస్తుతం ఎక్కడ చూసిన చెత్త దర్శనమిస్తోంది. 15 రోజుల నుంచి ఇలా చెత్త పేరుకుపోయిందని.. దాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు, వినతి పత్రాలు అందజేసినా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇంటింటి చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులు మంగళం పాడటంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఆర్టీఓ ప్రధాన రహదారితో పాటు పవన్‌గ్యాస్ వెనుక, రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా చెత్తమయం అయ్యాయి. ఇక ఇంటింటి చెత్త సేకరణ చేయాలంటే కచ్చితంగా రూ.30 చెల్లించాల్సిందేనని పారిశుధ్య కార్మికులు ప్రజలకు తెగేసి చెబుతున్నారు. తమకు వసూలు చేయాలని అధికారులు చెప్పారని.. కచ్చితంగా డబ్బులు ఇస్తేనే రోజు సేకరిస్తామని చెబుతుండడం గమనార్హం. పైగా రూ.30 చెల్లించినా ప్రతి రోజూ సేకరించేది లేదంట... వారంలో రెండు మూడు రోజులు మాత్రమే ఇంటింటి చెత్త సేకరణ చేపడుతామని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై వేసిన చెత్తతో దోమలు విపరీతంగా పెరిగి... రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులకు, సమీపంలోని వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్టీఓ కార్యాలయం రోడ్డులో చెత్త

వాడవాడలా ఉగాది సంబరాలు



రైల్వేస్టేషన్ వద్ద అలంకరణలో వరసిద్ధి వినాయకుడు



మొదటిరోడ్డులో కాశీవిశ్వేశ్వరుడి ఆలయంలో స్వామి అలంకరణ



పాతూరులో అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి



రెవెన్యూకాలనీలో కోదండరామస్వామి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9: తెలుగువారి నూతన సంవత్స రాది ఉగాదిని జిల్లావాసులు మంగళవారం ఉత్సాహంగా జరుపుకు న్నారు. క్రోధి నామ సంవత్సరాన్ని ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో విశేష పూజాకార్యక్రమాలు, పంచాంగ పఠనాలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. ఇల్లూవాకిలి అందంగా అలంకరించుకుని, మామిడాకులు, వేపమండలు గడపమానుకు కట్టి, తెలుగువారి నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తుల సందర్శనలతో కిటకిటలాడాయి. దీనికితోడు వాడవాడలా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణాలలో ప్రజలు విరివిగా పాల్గొని, కొత్త సంవత్సరాది ఫలితాలు ఎలా వుండనున్నాయో ఆసక్తిగా ఆలకించారు. నగరంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.



రైల్వేస్టేషన్ వద్ద వరసిద్ధి వినాయకుడి ఆలయంలో భక్తుల రద్దీ

గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 9: మండలంలోని మేడాపురం, ఒంటికొండ, ప్యాధిండి గ్రామాల్లో ఉగాది ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేడాపురంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఏటా ఉగాది సందర్భంగా నాలుగురోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున నుంచి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఆలయం చుట్టూ పలహారపు బండ్లనుతిప్పారు. సాయంత్రం స్వామివారి పంజుసేవకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఒంటికొండలో ఉగాది పండుగను పురష్కరించుకుని అక్కదేవతల బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కొడపగానిపల్లి సమీపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆమిదాలకుంట, ప్రసన్నాయపేట, ఓబుళంపల్లి గ్రామాల మీదుగా మంగళవారం సాగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అక్కదేవతలను దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ పలహారపు బండ్లు తిప్పారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు బుధవారం పరుష, కుంకాలు కార్యక్రమంతో ముగుస్తాయి. ప్యాధిండిలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు, పంజుసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.







మేడాపురంలో అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఒంటికొండలో అక్కదేవతల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు, కష్టాలు తీర్చాలని ఊరేగింపులో భక్తుల సాష్టాంగం

శిల్పారామంలో...

అనంతపురంరూరల్ : నగర శివారుల్లోని శిల్పారామంలో ఉగాది మంగళవారం పండితులతో పంచాగ శ్రవణం పట్టించారు. అనంతరం శ్రీనృత్య కళానిలయం, నృత్య గురువు సంధ్యామూర్తి వారి శిష్య బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రణవ, లక్ష్మికీర్తన, సుబిక, లాసాని, తమోజ్ఞప్రీతి, చంద్రలేఖ, బాబిత, తన్మయి, సహస్ర, మోక్షిత, కేతన, నియతి, తత్విక, దివిజ కళాకారులు పుష్పాంజలి, నమామి, సాంబశివ, వినోరభాగ్యము, ఇదిగో భద్రాద్రి, పరజ్‌తిల్లన పాటలకు నృత్యప్రదర్శన చేశారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

టీడీపీ కార్యాలయంలో ఉగాది పూజలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9 : ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఉగాది పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. వేద పండితుడితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఫాదర్ ఫెర్రర్‌కు నివాళి : ఫాదర్ ఫెర్రర్ జయంతిని పురష్కరించుకొని కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమా లలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, నాయకులు రాయల్ మురళీ, రాజారావు, గంగారామ్, సురేష్, రంగయ్య, వన్నూర్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు: ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని అనంతపురం అర్బన్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ కొత్తూరు, పాతూరు అమ్మవారి శాలల్లో మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పండితులు ఆయన్ను సన్మానించారు.



టీడీపీ అర్బన్ కార్యాలయంలో పూజలు చేస్తున్న కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ

బీసీలపై దాడులు, కేసులపై చర్చకు సిద్ధమా..!

ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి పరిటాల సునీత సవాల్

రామగిరి, ఏప్రిల్ 9: 'ఎన్నికల్లో ఓట్ల కోసం బీసీల జపం చేస్తున్న ప్రకాశ్‌రెడ్డీ... నీకు అసలు ఆ పేరు ఎత్తే అర్హతే లేదు. ఈ ఐదేళ్ల బీసీలపై దాడులు, కేసులు పెట్టించిన నీవు... ఇప్పుడు వారిపై ఎక్కడ లేని ప్రేమ చూపుతున్నావ్. నీకు నిజంగా బీసీలపై ప్రేమే ఉంటే బహిరంగ చర్చకురా... నీవు బీసీలపై ఎన్ని దాడులు చేయించావో.. ఎన్ని కేసులు పెట్టించావో చెబుతా... చర్చకు ఎక్కడైనా నేను రెడీ... మరి నీరు సిద్ధమా..' అని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి మాజీ మంత్రి, కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత బహిరంగ సవాల్ విసిరారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ప్రకాశ్‌రెడ్డివి ఉత్త మాటలే తప్ప.. చేతలు ఏమీ ఉండవని బీసీలకే కాదు... నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ తెలిసిపోయిందన్నారు. ఇక మాటలు నమ్మే స్థితిలో వారు లేరన్నారు. మీ స్వగ్రామంలో వాల్మీకి ఆదినారాయణ, సీకేపల్లిలో బోయ అమరేంద్ర, బి.యాలేరులో పరుశురాంపై కేసులు నమోదు చేసి రౌడీషీట్ తెరిపించారని, ఇదేలా బోయలకు, కురుబలకు మీరిచ్చే గౌరవమని ప్రశ్నించారు. ఆత్మకూరు మండల అభివృద్ధి గురించి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. ఒక్క ఆత్మకూరు మండలంకాదే నియోజకవర్గంలో ఏ మండలంలోనైనా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. తమ సోదరుడు, నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని, అవి నిజమే అయితే ఐదేళ్ల అధికారంలో ఉండి తమపై ఎందుకు చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు.



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక

అనంతపురం రూరల్ మండలంలోని ఇటుకలపల్లి గ్రామం నుంచి 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వెంకటాపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో వారు పార్టీలో చేశారు.

వైసీపీకి ఓటుతో బుద్ధిచెప్పండి

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె, ఏప్రిల్ 9: ఈ ఐదేళ్ల పాటు రాక్షసపాలన సాగించిన వైసీపీ పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ ప్రజలకు సూచించారు. మంగళవారం ఆమె ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డితో కలసి మండలంలోని కనుంపల్లి, పాపినేపాళ్యం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు గుర్రం ఆదినారాయణ, శాలిని, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్టాయ్య, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లూరు రామాంజి, గుత్తా బాలకృష్ణ, వడ్డేవన్నూర్, డేగల కృష్ణమూర్తి, బాబయ్య, గోరకాటి వెంకటేసు, సుంకన్న, పుల్లన్న, నరసింహారెడ్డి, చితంబరప్ప, అంజి, ఆవుల శీనా, సామాల మధు, రాము, చింతబరిదొర, ఎల్ఐసీ ఆదినారాయణ, గుత్తాహరి పాల్గొన్నారు.

నార్పల : నార్పలలో బండారు శ్రావణి శ్రీ, ఆలం నరసానాయుడు, కేశవరెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈనెల 13న ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ గార్లదిన్నె మండలం కల్లూరులో రోడ్‌షో నిర్వహిస్తారని, ఆరు మండలాల నుంచి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల ఆంజనేయులు, రంగారెడ్డి, ఎర్రనాగప్ప, లక్ష్మీనారాయణ, ఆకులప్రసాద్, తలారి కుల్లాయప్ప, చంద్రబాబు పాల్గొన్నారు.



కనుంపల్లిలో ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ



ఫాదర్‌ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాంచోఫెర్రర్, విశాలాఫెర్రర్

ఫాదర్ ఫెర్రర్ సేవలు అమోఘం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9: కరవు జిల్లాలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ చేసిన సేవలు అమోఘమని మాజీ ఎమ్మెల్యే అవే సంస్థ అధ్యక్షుడు వైకుంఠం ప్రభాకర్‌చౌదరి కొనియాడారు. మంగళవారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్‌ఫెర్రర్ జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, అవే సంస్థ అధ్యక్షుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, విశాలాఫెర్రర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని ఆచరణలో చేసి చూపించిన గొప్ప మానవతావాది ఫాదర్ పేదల గుండెల్లో చిరస్మరణీయులని కొనియాడారు. విద్య, వైద్యం, కాలనీల్లో అభివృద్ధికి ఫాదర్ ఫెర్రర్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. విదేశీ విరాళాల అంశంలో తలెత్తిన సమస్యపై ఢిల్లీలో కేంద్రప్రభుత్వ పెద్దలను కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఫాదర్‌ఫెర్రర్ ఆశయాలను కొనసాగిస్తామని మాంఛోఫెర్రర్, విశాలాఫెర్రర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, నాయకులు దేవళ్ల మురళీ, మారుతికుమార్ గౌడ్, మార్కెట్ మహేష్, వన్నూరప్ప, బంగి నాగ, రాప్తాడు రంగా, అజీజ్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో సంబరాలు



కలెక్టరును సత్కరిస్తున్న పూజారులు, సాహిత్యకారులు

అనంతపురం టౌన్ : కలెక్టరేట్‌లో మంగళవారం ఉగాది సంబరాలు నిర్వహించారు. మినీ కాన్ఫరెన్స్‌లో పూజారులు కలెక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా పూజలు చేయించారు. అనంతరం రామ్మోహన్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. కలెక్టరును పూజారులు, సాహితీవేత్తలు, అధికారులు సత్కరించారు.

ఉత్సాహంగా ఇసుక మూట మోసే పందెం



130 కేజీల ఇసుక మూట మోస్తున్న పాల్తూరు రాజు

గార్లదిన్నె, ఏప్రిల్ 9 : ఉగాది పండుగను పురష్కరించుకుని కల్లూరు కొండకింద కొట్టాలలో మంగళవారం 130 కేజీల ఇసుక మూట మోసే పందెం నిర్వహించారు. ఈ పందెంలో పాల్గొనేందుకు వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో యువకులు వచ్చారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఉరవకొండ మండలం పాల్తూరుకు చెందిన రాజు రూ. 5వేలు, రెండో స్థానంలో నిలిచిన ఆగ్రహారం సుధాకర్‌కు రూ. 2500, మూడో స్థానంలో నిలిచిన పాల్లూరు రవికి రూ. 1500, నాల్గో స్థానంలో నిలిచిన చిత్రచేడు సుధాకర్‌కు రూ.1000 అందచేశారు. కార్యక్రమంలో రైస్‌మిల్ వెంకట్రాముడు, బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాప్తాడు, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం మరూరులో చిన్నక దర్యస్వామి, రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి, గొందిరెడ్డిపల్లిలో ఉజ్జినేశ్వరస్వామి, యర్రగుంటలో నరసింహస్వామి, బండమీదపల్లిలో వెంకటేశ్వరస్వామి, అంజనేయస్వామి, హంపాపురంలో మౌనగిరి అంజనేయస్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రితాతస్వామి, తదితర స్వాములను ప్రత్యేకంగా పూజలు చేశారు.



హంపాపురంలో ఆంజనేయస్వామి





బండమీదపల్లిలో ఆంజనేయస్వామి, మరూరులో చిన్నకదరయ్యస్వామి అలంకరణ

చేనేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోండి

నార్పల, ఏప్రిల్ 9: చేనేత కార్మికుడు బండి నాగనంద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ బషీర్ అహ్మద్, రాష్ట్ర కమిటీ సభ్యులు మాయకుంట్ల మోహన్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రమౌళి డిమాండ్ చేశారు. మంగళవారం బండి నాగనంద కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలు, మృతుని పిల్లల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

జేఎన్‌టీయూకి స్టీమ్ బాయిలర్ వితరణ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 9: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వపు విద్యార్థి చిరంజీవి.. శిల్ప బాలికల హాస్టల్‌కు స్టీమ్ బాయిలర్‌ను వితరణ చేశారు. ఆదివారం కళాశాల అధికారులను కలిసి హాస్టల్ సిబ్బందికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ 1963-68 విద్యాసంవత్సరం బీటెక్ అభ్యసించిన స్నేహితులతో కలిసి తమ వంతుగా సహాయ సహకారాలందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శిల్ప హాస్టల్‌కు నూతన కుకింగ్ స్టీబ్ బాయిలర్‌ను అందజేశామని, ఎల్లోరా హాస్టల్‌లోని స్టీమ్ బాయిలర్‌ను మరమ్మతు చేయించామని అన్నారు.

'ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి పిచ్చిపట్టింది'

ఆత్మకూరు, ఏప్రిల్ 9: నియోజకవర్గంలో పరిటాల సునీత చేస్తున్న ప్రచారానికి భారీ స్పందన వస్తోందని, రోజు రోజుకూ వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, వీటిని చూసి ఓర్వలేక వైసీపీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి పిచ్చిపట్టిందని రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బండి పరుశురామ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడు తూ... అలా పిచ్చిపట్టిన ఆయన వీధుల్లో ఇష్టం వచ్చినట్లు అరుస్తూ... పరిటాల కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కురుబలు, వాల్మీకులను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన ప్రకాష్‌రెడ్డి... ఈ ఐదేళ్ల వారిపైనే దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటమే కాకుండా అక్రమ కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావడానికి వారిపై కపట ప్రేమ చూపిస్తున్నారని, దీన్ని బీసీలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. భూకబ్జాలు, దౌర్జన్యాలు, అమ్మ డెయిరీ పేరుతో మోసాలు తదితర వాటితో ప్రజలు విసిగిపోయారని, వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

రూ.6.5 లక్షలు చోరీ

శింగనమల, ఏప్రిల్ 9: నాయనపల్లి క్రాస్‌లో కమ్మలమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి దుండగలు చొరబడి రూ.5 లక్షలు, రూ.1,50,000 విలువగల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కమ్మలమ్మ, అతని కూమారుడు హోటల్ నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి హోటల్ పని పూర్తి చేసుకుని పెట్రోల్ బంకు వద్ద ఎన్న ఇంటికి చేరుకొని రాత్రి తల్లి, కుమారుడు బాల్కన్‌లో నిద్రపోయారు. ఆదివారం రాత్రి దొంగలు బాల్కన్ కింద రూములో చొరపడి బీరువా పగలగొట్టి.. అందులోని నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. సోమవారం కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో... డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేడుకగా ఉగాది

కిటకిటలాడిన ఆలయాలు... దైవదర్శనం కోసం క్యూకట్టిన భక్తులు...

శ్రీక్రోధినామ ఉగాదిని ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. మామిడితోరణాలతో ఇళ్లు కళకళలాడాయి. ఉగాది పచ్చడిని, పిండివంటలను చేసుకుని ఆరగించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం జరిగింది.


పంచాంగం పఠిస్తున్న వేదపండితులు

కసాపురంలో పంచాంగ శ్రవణం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 9: క్రోధినామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. వేకువజామున స్వామి వారి మూలవిరాటుకు స్వర్ణవజ్రకవచ అలంకరణ చేసి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో వేదపండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను విశేష పుష్పలంకరణ చేసి గరుడ వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజి, ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున,ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు, కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు, కసాపురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గుత్తిరూరల్: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ఉదయమే పొలాలకు వెళ్లి పొలంలో ప్రత్యేక పూజలు చేసి తమ ఎద్దులతో ఏరువాక సాగును ప్రారంభించారు.

గుంతకల్లుటౌన్: ఉగాది పండుగను పట్టణ, మండల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో పిండి వంటలు, పచ్చడి చేసుకుని పూజలు చేశారు. నూతన వస్త్రాలను ధరించి సాయంత్రం దేవాలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తిఆర్ఎస్‌లలో ఉగాది పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో పిండి వంటలు, పచ్చడి చేసుకుని పూజలు చేసుకున్నారు. అనంతరం దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభయాంజనేయుడికి ఆకుపూజ



ఉరవకొండ: ఉగాది వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని అభయాంజనేయస్వామి, అయ్యప్ప స్వామి, షిర్డీసాయి బాబా, చౌడేశ్వరీదేవి, దుర్గాభవాని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. చిన్నముష్టూరు కల్లంబండ ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకాలు, ఆకుపూజలు చేశారు. ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. పట్టణంలోని చెరువుకట్ట మీద వెలసిన సుంకలమ్మదేవి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. .వజ్రకరూరు మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని జనార్దన వేంకటేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

అప్పలాపురం ఆంజనేయస్వామి ఆలయంలో...



రాయదుర్గంరూరల్: మండలంలోని వడ్రవన్నూరులో సమీపంలో వెలసిన అప్పలాపురం ఆంజనేయస్వామి మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా దేవాలయాలలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రలంకరణ తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేమకల్లులో...



బొమ్మనహాళ్: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం క్రోధినామ సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో లోగిళ్లన్నీ మామిడితోరణాలతో కళకళలాడాయి. ప్రజలు నూతన వస్త్రాలను ధరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నేమకల్లు, ఉంతకల్లు గ్రామాలలోని ప్రధాన ఆలయాలైన శ్రీ ఆంజనేయస్వామి, రుక్మిణీ పాండురంగస్వామి ఆలయాల్లో విశేషపూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పించి విశేషపూజలు చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని తీసుకున్నారు.


పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు

తగ్గుపర్తమ్మకు పుష్పాలంకరణ



బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తిలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆరాధ్యదైవం గ్రామదేవత తగ్గుపర్తమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ పూజలు చేసి సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాన్ని డోలుడప్పులతో ఊరేగించారు.


కణేకల్లులో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు

కణేకల్లులో...

కణేకల్లు: క్రోధినామ సంవత్సర ఉగాదిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్థానిక చిక్కణ్ణేశ్వరాలయంలో వేదపండితులు పంచాంగ శ్రవణాన్ని వినిపించి ఈ ఏడాది వర్షాలు, పంటలు, ధరలు ఏ విధంగా ఉంటాయనే విషయాన్ని వివరించారు.

అమ్మవార్లకు అభిషేకం



తాడిపత్రిటౌన్: ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న పెద్దమ్మతల్లి, చౌడేశ్వరిదేవి, సుంకులమ్మ, గంగమ్మ, పొలిమేర పెద్దమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. సుంకులమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి స్థానిక పెన్నానది నుంచి కలశంలో నీటిని ఊరేగింపుగా తీసుకువచ్చి అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

తక్కళ్లపల్లి పెద్దమ్మతల్లికి పూజలు

యల్లనూరు: మండలంలో మంగళవారం తెలుగు సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని లక్ష్మీ వేంకటరమణస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం మురళీస్వామి చదివి వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా మంగళవారం క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తక్కళ్లపల్లి పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలివెళ్లి పూజలు నిర్వహించారు.

పెద్దపప్పూరు: మండలవ్యాప్తంగా ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవార్లకు పూజలు చేశారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం, శివాలయం, గంగమ్మ, సుంకులమ్మ ఆలయంతోపాటు మండలంలోని ఆలయాల్లో మంగళవారం ఉగాదిపర్వదినాన్ని పురస్కరించుకొని పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి, శివపార్వతుల ఉత్సవమూర్తులను గ్రామ పుర వీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.


యాడికిలో శ్రీ సీతారాములవారు

కమనీయం... రాములోరి కల్యాణం

యాడికి: ఉగాది పర్వదినం పురస్కరించుకొని యాడికిలోని రామాలయంలో మంగళవారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్త జనసందోహం మధ్య సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సీతాసమేతుడైన రాములోరిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాయలచెరువు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన చెన్నకేశవున్ని దర్శించుకోవడానికి భక్తులు క్యూకట్టారు. యాడికిలోని చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.


రాయలచెరువులో దేవేరులతో చెన్నకేశవుడు

రాయదుర్గంరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మామిడాకులతో తోరణాలు కట్టి ఇళ్లను అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడిని ఇంటిల్లి పాదీ ఆరగించారు. ఈ ఏడాది వానలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.

కళ్యాణదుర్గం రూపురేఖలు మారుస్తా

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు




పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్న అమిలినేని సురేంద్రబాబు, ఫాదర్ ఫెర్రర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ...

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 9: నియోజకవర్గానికి మంచి రోజులు వస్తున్నాయని, ఒక్క చాన్స్ ఇస్తే కళ్యాణదుర్గం రూపురేఖలు మారుస్తానని ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రజావేదిక వద్ద పంచాంగ శ్రవణం జరిగింది. కార్యక్రమంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమిలినేని సురేంద్రబాబును ఆశీర్వదించారు. నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులకు అమిలినేని ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాది నుంచే కళ్యాణదుర్గానికి మంచిరోజులు రాబోతున్నాయని అన్నారు. చాన్స్ ఇవ్వాలని, కళ్యాణదుర్గం రూపురేఖలు మారుస్తానన్నారు. ఈ యేడాది ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు వరించాలని, పాడి పంటలు, పచ్చదనంతో గ్రామాలన్నీ కళకళలాడాలని ఆకాంక్షించారు. టీడీపీతోనే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించడమే కాకుండా గ్రామీణ రహదారులకు రోడ్లు వేయించి పల్లెలన్నీ అభివృద్ధి పథంలో నడిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజల్లో ఎంతో ఆదరణ లభిస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి గ్రామాన్ని సందర్శించి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కళ్యాణదుర్గంలో ఈసారి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహావిష్కరణ

కుందుర్పి: పేద ప్రజల ఆరాధ్యుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని కళ్యాణదుర్గం ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఫెర్రర్ విగ్రహావిష్కరణకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఫాదర్ ఫెర్రర్ చేసిన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో మాంచో ఫెర్రర్ తదితరులు పాల్గొన్నారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం


పోర్టర్స్‌లైన్ ఏరియా ముస్లిం మైనార్టీలతో మాట్లాడుతున్న జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 9: తనకు ముస్లిం మైనార్టీలు ఆదరించి, ఓటేసి గెలిపించాలని గుమ్మనూరు జయరాం పోర్టర్స్‌లైన్ ముస్లిం మైనార్టీలను కోరారు. మంగళవారం రాత్రి పట్టణంలోని 34వ వార్డులో ఆయన ముస్లిం మైనార్టీలతో భేటీ అయ్యారు. టీడీపీ నాయకుడు సంజీవులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని, తాను ముస్లిం మైనార్టీల వికాసానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఒకసారి అవకాశమిస్తే తన వ్యవహార శైలి, సన్నిహిత భావం ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బీఎస్ కృష్ణారెడ్డి, బండారు ఆనంద్, కేసీ హరి, పత్తి హిమబిందు, రామన్న చౌదరి, కేఎల్ శీన పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని ఖిల్లా జామియా మసీద్‌లో మంగళవారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పాల్గొన్నారు. వారితో కలిసి విందు ఆరగించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్‌బాషా, టీడీపీ ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు కొట్టం మాలిక్‌బాషా, ముస్లిం మైనార్టీలు ఉరవకొండ బాషా, మాబు, దాదాఖలందర్, మహమ్మద్‌రఫీ, జిలాన్ పాల్గొన్నారు.

రైతును పరామర్శించిన జేసీ అశ్మిత్‌రెడ్డి


బాధిత రైతుతో మాట్లాడుతున్న అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 9: మండలంలోని కావేరిసముద్రం గ్రామానికి చెందిన రైతు భోగాదిరెడ్డిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. రెండురోజులక్రితం భోగాదిరెడ్డికి చెందిన 7ఎకరాల్లో మొక్కజొన్న పంటతోపాటు డ్రిప్పుపైపులు, పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న జేసీ అస్మిత్‌రెడ్డి గ్రామానికి వెళ్లి పొలాన్ని పరిశీలించారు. రైతును పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి సంజీవరెడ్డి, అంజనేయరెడ్డి తదితరులు ఉన్నారు.

దుమ్ము, ధూళి నుంచి గ్రామాన్ని కాపాడండి

సోమలాపురం గ్రామస్థులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 9: మైన్స్ నుంచి అధిక దుమ్ము, ధూళి వస్తోందని, వాటి నుంచి గ్రామాన్ని కాపాడాలని సోమలాపురం గ్రామస్థులు కోరారు. మంగళవారం వారు సమావేశమై సమస్యపై చర్చించారు. సోమలాపురం సమీపంలో గూడ్స్ వాహనాల నుంచి మైన్స్‌ను ఇక్కడ డంపింగ్ చేసుకొని మండలవ్యాప్తంగా ఫ్యాక్టరీలకు ప్రతిరోజూ టిప్పర్ల ద్వారా తరలించడం జరుగుతోందన్నారు. ప్రతి రోజూ వందల మేర టిప్పర్లు వెళతాయన్నారు. ఈ నేపథ్యంలో దుమ్ము, ధూళితో కాలుష్య సమస్య నెలకొంటోందన్నారు. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంటలు కాలుష్యంతో దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు సైతం కలుషితమవుతోందని, అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో నిరసన చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

యల్లనూరు, ఏప్రిల్ 9: మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదుచేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండురోజులక్రితం మహేశ్వరరెడ్డి, రామనాథరెడ్డి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో గొడవపడ్డారు. ఇదే విషయమై సోమవారం రాత్రి ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

అభ్యర్థుల గెలుపు కోసం పూజలు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 9: మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని అమ్మవారి ఆలయంలో అభ్యర్థుల విజయం కోసం టీడీపీ నాయకులు సప్తగిరి సత్యనారాయణ మంగళవారం పూజలు జరిపించారు. గంగాజలం తెచ్చి అభిషేకించి ప్రత్యేక పూజలు చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కాలవ శ్రీనివాసులు రాయదుర్గం శాసనసభ్యులుగా విజయం సాధించాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లన్న, దిలీప్, లేపాక్షి, మాజీ సర్పంచ్ సులేమాన్, మాజీ ఎంపీటీసీ కెంచప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి


యాడికిలో ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళి

ఉరవకొండ, ఏప్రిల్ 9: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లత్తవరం గ్రామంలో డీజీహెచ్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, చెన్నకేశవులు, వెంకటేశులు, శివ, మల్లికార్జున, మారెన్న, డీజీహెచ్‌ఎస్ఎస్ నాయకులు గోపాల్, చంద్ర, ఎర్రిస్వామి, ఎల్లప్ప పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని పామిడమ్మ దేవాలయంలోని సచివాలయంలో మంగళవారం ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ జయంతిని విశాలా ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, ఆ సంఘం మండల అధ్యక్షులు కేశవాచారి, నాగభూషణ, సర్వేష్, శివన్న, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

యాడికి: ఫాదర్ ఫెర్రర్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఫాదర్ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకొని యాడికిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కరువు జిల్లా అనంతపురంలో ఆయన చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణం, పేద విద్యార్థులకు ఉన్నత విద్య, బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మండల దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో అధ్యక్షుడు కదిరప్ప, పలువురు దివ్యాంగులు ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఆర్డీటీ సీఓ ఆంజనేయులు, సీడీసీ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ పర్యటన

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 9: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలైన వీరాపురం, గంగాదేవిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎస్పీ అమిత్ బర్దార్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎవరూ గొడవలకు, ఘర్షణలకు దిగరాదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ప్రశాంతంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు. అంతకుముందు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ గంగయ్య, సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ సాగర్‌లతో సమావేశం నిర్వహించారు.

టీడీపీ నాయకుడి మృతి

కూడేరు, ఏప్రిల్ 9: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు ఓబులప్ప (62)మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చలివేంద్రం ఏర్పాటు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 9: బొమ్మనహాళ్ మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామంలో టీడీపీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ యూత్ నాయకులు రాము, గోపి, అమరేష్, రఘు, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

యాడికి, ఏప్రిల్ 9: టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి మంగళవారం యాడికి మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన గోపాల్‌రెడ్డిని ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సులేమాన్, హాజీ బాషా, రహంతుల్లా, చాంద్‌బాషా, ప్రసాద్‌రెడ్డి, తిరంపురం నీలకంఠ, ఆదినారాయణ, రామకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందు ఇస్తున్న చవ్వా గోపాల్‌రెడ్డి

యువతి ఆత్మహత్య

పామిడి, ఏప్రిల్ 9: మండలంలోని పాళ్యంతండాలో సోమవారం రాత్రి మౌనిక(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గుంతకల్లు మండలం కదిరిపల్లి గ్రామానికి చెందిన శీననాయక్ కుమార్తె మౌనికను మూడు సంవత్సరాల క్రితం పాళ్యంతండాకు చెందిన వెంకటేష్‌నాయక్‌తో వివాహం జరిగింది. అయితే భర్తతో తరచూ మౌనిక గొడవపడేది. తల్లిదండ్రులు మౌనికను మందలించారు. ఈ నేపథ్యంలో క్షణికావేశంలో పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి శీననాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తిరూరల్, ఏప్రిల్ 9: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణపేటకు చెందిన నాగయ్య ద్విచక్రవాహనంలో తాడిపత్రి నుంచి గుంతకల్లుకు వస్తుండగా జక్కలచెరువు గ్రామ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఇద్దరికి...

రాయదుర్గంరూరల్: పట్టణ సమీపంలోని ఎక్స్‌ప్రెస్ తోట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందకు పడడంతో చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన మంజునాథ, తిరుమలేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన మంజునాథ, తిరుమలేష్ పని ముగించుకుని చదం గొల్లలదొడ్డికి వెళుతుండగా ఎక్స్‌ప్రెస్ తోట వద్ద బైక్ అదుపుతప్పి కిందకు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.